క్లుప్తంగా

నేడు గృహ సారథులకు శిక్షణ

బుట్టాయగూడెం : మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, వలంటీర్లకు గురువారం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని నందాపురం ఆస్పత్రికి ఎదురుగా ఉన్న నిర్వాసితుల కాలనీ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గ పరిశీలకులు పాతపాటి వీర్రాజు హాజరవుతారని చెప్పారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం



ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : పుట్లగట్లగూడెం గ్రామంలో మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దివంగత సర్పంచ్ వామిశెట్టి దుర్గమ్మ పేరు మీద వారి కుటుంబ సభ్యులు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం స్థలాన్ని అందజేశారు. దుర్గమ్మ భర్త వామిశెట్టి కృష్ణారావు, వారి కుమారులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వామిశెట్టి కుమార్ రెండు సెంట్ల స్థలాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థల దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు

ఆర్థిక సహాయం అందజేత



నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

బుట్టాయగూడెం : విజయవాడ అంధుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువు, వారి పోషణ కోసం స్థానిక విద్యారోహిణీ విద్యార్థులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు సుమారు రూ. 58,820 నగదును స్నేహ బ్లెండ్ స్కూల్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా నిధులు సేకరించిన మనోజ్‌కుమార్, దాసరి భేషజి, తస్నీరు జాహ్నవితోపాటు 20 మంది విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి

చింతలపూడి : ఆల్ ఇండియ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర సంయుక్త కార్యర్శి బోడా బాలా నాయక్ ఆధ్వర్యంలో రేచర్ల, నామవరం, పంతంగుల గూడెం తండాల్లో ఈ కార్యక్రమం జరిగింది. సేవాలాల్ చిత్రపటాలకు అధక్షుడు బోడా నాగేశ్వరరావు, దేశావత్తు రామరాజు నాయక్, దారా కాంతా రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాఘవ నాయక్, బాలు నాయక్, హుస్సేన్ నాయక్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పన్నుల వసూళ్లు

జంగారెడ్డిగూడెం : ఆస్తిపన్ను బకాయిదారుల నుంచి పన్నుల వసూళ్ల కార్యక్రమం మూడవ రోజు కొనసాగినట్లు మునిసిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఆస్తిపన్ను బకాయిదారులు, రెడ్ నోటీసు ఇచ్చిన మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి ఆస్తిపన్ను చెల్లించాలని తెలిపామన్నారు. దీంతో కొందరు స్పందించి నగదు, చెక్కు రూపంలో పన్నులు చెల్లించినట్లు తెలిపారు. ఈ విధంగా రూ.8లక్షలు వసూలయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.సుబ్బారావు, మేనేజర్ కె.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంస్కృతిపై శిక్షణ

ఏలూరు (టూటౌన్): విశ్వబ్రాహ్మణ సంస్కృతి సంప్రదాయాలపై స్థానిక కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో బుధవారం ఏర్పాటుచేసిన శిక్షణను ఆచార్య చంద్రపాటి వరప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ప్రతి ఒక్కరూ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. బ్రాహ్మణత్వం, సంధ్యావందనం, వేద మంత్ర అధ్యయనం వంటి అనేక విషయాలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వేద బ్రహ్మశ్రీ తామడ మోహన్‌రావు, ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కన్వీనర్ ఎ.శివశ్రీ, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, గూడూరి హేమ దుర్గాప్రసాద్, కాదలూరి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు కార్యకర్తల సంఘం జిల్లా కన్వీనర్‌గా హరీష్

ఏలూరు (టూటౌన్): సమాచార హక్కు కార్యకర్తల సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్‌గా నగరానికి చెందిన వైవీ హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు ముత్తు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో సమాచార హక్కు వినియోగం ,ఉపయోగాలపై ప్రజలకు తెలియజేయనున్నట్టు చెప్పారు. సమాచార హక్కు చట్టం అందరికీ తెలిసే విధంగా చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అవినీతిపై అక్రమాలపై ప్రశ్నించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని చెప్పారు.

రానున్న ఎన్నికల్లో విజయసారథులు మీరే

వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు పాతపాటి సర్రాజు





రేపల్లెవాడ సమావేశంలో మాట్లాడుతున్న సర్రాజు, బొర్రంపాలెంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న పాతపాటి సర్రాజు

కొయ్యలగూడెం : వచ్చే సార్వత్రిక ఎన్నికలలో విజయ సారథులు మీరేనంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు పేర్కొన్నారు. జగనన్న సచివాలయ మండల కో–ఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పాతపాటి సర్రాజు పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పునః ఏర్పాటుకు తీసుకోవలసిన ప్రణాళికలపై వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చూడాలనుకునే వారిలో సంక్షేమ పథకాలను అందుకుంటున్న ప్రతిపక్షాల ప్రజలు కూడా ఉన్నారని అటువంటి వారిని కలుపుకుని 175 అసెంబ్లీ నియోజకవర్గాల గెలుపునకు రాష్ట్రవ్యాప్తంగా గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు, వలంటీర్లు వ్యవహరిస్తున్నారన్నారు. 2009 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలలో కూడా నాటి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిని ఎదుర్కోవడానికి దుష్ట చతుష్టయంగా టీడీపీ, టీఆర్‌ఎస్, పీఆర్‌పీ, వామపక్షాలు వ్యవహరించినా మహానేత గెలుపును నిలువరించ లేకపోయారన్నారు. అదేవిధంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు ఏకమైనా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేవని జోస్యం పలికారు. టీడీపీ, జనసేనల కలయిక ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటన వరకే అని ఆపై రెండు పార్టీలు ఉప్పు, నిప్పులుగా మారతాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు తమ మదిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మినహా వేరొక వ్యక్తిని ఊహించుకునే స్థితిలో లేరని, సంక్షేమ పథకాలతో అణగారిన అట్టడుగు వర్గాల ప్రజల హృదయాలలో జగన్ సుస్థిర స్థానం సంపాదించగలిగారన్నారు. కన్వీనర్లుగా, గృహసారథులుగా, వలంటీర్లుగా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా, వ్యవహరించడం బాధ్యతగా భావిస్తున్నారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఏర్పాటుకు నాలుగు స్తంభాలుగా వ్యవహరించబోతున్నామని గర్వంగా భావిస్తున్నారని పాతపాటి అభివర్ణించారు. అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు గంజిమాల రామారావు, తుమ్మలపల్లి గంగరాజు, మంతెన సోమరాజు, మట్టా సత్తిపండు, తాడిగడప రామకృష్ణ, గంటా శ్రీను, ఘంటసాల సీనమ్మ, యువజన నాయకులు యడ్లపల్లి సురేష్, కుక్కల ఫణి, బొబ్బర దినేష్, ఏలేటి చంద్రం, కండెల్లి శివ, మారిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

టి.నరసాపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం పరిశీలకులు పాతపాటి సర్రాజు అన్నారు. బొర్రంపాలెం గ్రామంలో సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్షా సమావేశం జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనా సమయంలో సైతం సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి వలంటీర్ పరధిలో ఇద్దరు గృహ సారథులు పనిచేస్తారని తెలిపారు. కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందనివారు ఎవరైనా ఉంటే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి కూడా సంక్షేమ పథకాలు అందేటట్లు చర్యలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీను రాజు, సొసైటీ చైర్‌పర్సన్‌లు వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి, కాల్నీడి సుబ్బారావు, కేతవరం సర్పంచ్ తడికలపూడి శివ మాధవి కిషోర్, బొంతు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాలను ప్రత్యేక పంచాయతీ చేయాలని వినతి



ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐదు గ్రామాల ప్రజలు

టి.నరసాపురం : టి.నరసాపురం పంచాయతీలోని ఐదు గ్రామాలను ప్రత్యేక పంచాయతీ చేయాలని ఆ గ్రామాల ప్రజలు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు చింతలపూడి మార్కెట్ యార్డులో సేవాలాల్ మహారాజ్ 284 జయంతి వేడుకలకు బుధవారం హాజరైన ఎంపీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం, రుద్రకోటరాజుగూడెం, ప్రకాశ్‌నగర్, పుట్రేపు, కాపుగూడెం గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, మౌలిక సదుపాయలు కూడా సరిగా లేవని, ఈ గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా మార్చి అభివృద్ధికి సహకరించాలని ఎంపీ శ్రీధర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో అర్జా సాగర్, భూక్యా వేణుగోపాల్, గుండె మమారాజ్, మారుముల్ల సూరిబాబు, కుంజా కిరణ్, పండు వీరభద్రుడు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత సమాజం సంయుక్తంగా నిర్మిద్దాం



పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న టి.స్నేహన్

కొయ్యలగూడెం : రక్తహీనత రహిత సమాజం నిర్మించడానికి సమిష్టి కృషి చేయాలని సచివాయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కో–ఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ తెలిపారు. బుధవారం మండలంలోని యర్రంపేట గ్రామ సచివాలయాలను పరిశీలించారు. అక్కడ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన సర్వేలో గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త శాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ ఆదేశాలు మేరకు ప్రతీ సచివాలయంలో బాలల కోసం ప్రత్యేక రిజిస్టర్ నమోదు చేయాలన్నారు. అనంతరం అక్కడి ప్రాథమికోన్నత పాఠశాలలో 'రక్తహీనత–బాల్య వివాహాల నిర్మూలన' అనే అంశంపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు నేరమని, ఎవరైనా అతిక్రమించి బాలలకు పెళ్లి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణీలకు, బాలింతలకు, యుక్త వయసు బాలికలకు తరచూ హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాప యేసురత్నం, సచివాలయం కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, మహిళా పోలీసు గూటం సుధారాణి, ఏఎన్‌ఎం వలపుల లిల్లీ, సంక్షేమ కార్యదర్శి కాకి లక్ష్మీకుమారి, గ్రేడ్–6 కార్యదర్శి అందుగుల వెంకటరత్నం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచవరపు గోపాలకృష్ణ, వీఆర్‌ఓ చెమటబోయిన వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేష కుమారి, ఉపాధ్యాయులు విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను గుర్తు చేస్తాయి



చిన్ని రామ సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : అవార్డులు అనేవి బాధ్యతను గుర్తు చేస్తూ ఉంటాయని భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ జాతీయ సేవారత్న గ్రహీత చిన్ని రామ సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని అంబికా రెస్టారెంట్ అండ్ లాడ్జి సమావేశ మందిరంలో అవార్డు నిర్వహణ సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎవరూ చేయని విధంగా 360 జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం, కరోనా సమయంలో 40 గ్రామాలకు కరోనా నివారణ మందు పంపిణీ చేయడాని గుర్తిస్తూ చిన్ని రామ సత్యనారాయణకు జాతీయ సేవా రత్న అవార్డు ఇచ్చిన్నట్లు భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రపంచంలోనే 360 విగ్రహాలను ఇచ్చిన వారు లేరని తెలిపారు. అదే విధంగా ఏలూరులో నిర్వహించే లిమ్కా అవార్డు కార్యక్రమానికి సైతం చిన్ని రామసత్యనారాయణ ఆహ్వానిస్తున్నట్లు, అక్కడ సైతం ఆయన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రముఖ సినీ కళాకారులు ఉక్కుర్తి దుర్గారావు అధ్యక్షతన రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, జంగారెడ్డిగూడెం పట్టణ మానవ హక్కుల మిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్ని రామ సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, సంస్థ సభ్యులు కనపర్తి లక్ష్మీధనకుమార్, జొన్నకూటి వెంకటేశ్వరావు, అన్నపూర్ణదేవి, జి.సత్యనారాయణ, వెంకటేశ్వరావు, తిప్పాభట్ల రామకృష్ణ, హనుమంతరావు, ఎల్ఆర్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్‌ను దుశ్శాలువాతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందేలా వలంటీర్ నుంచి ప్రజాప్రతినిధులు వరకు అందరూ వారి బాధ్యతలను నెరవేర్చాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల నాయకులు మంత్రి రమేష్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులతో మంత్రి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. తొలుత మంత్రి జోగి రమేష్ గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఉభయగోదావరి జిల్లాల బూత్ కన్వీనర్‌ల కో–ఆర్డినేటర్ బీఆర్ఆర్ చౌదరి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి విజయసారధి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, నాయకులు బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న టోనిఫాదర్, తదితరులు

ద్వారకాతిరుమల : గొల్లగూడెంలో ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి బుధవారం విచారణకర్తలు టోనిఫాదర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపదేశి యు.ఫ్రాన్సస్, సంఘ పెద్దలు వీరరాఘవులు, వెంకటరత్నం, నాగేశ్వరరావు, చంటియ్య, బాబురావు, సుధాకరరావు, అశోక్ మురళి, దాసరి బాబురావు, కిషోర్, ప్రభాకరరావు, సునీల్ తదితరులున్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం సతీమణి స్వర్గీయ స్వర్ణకుమారి సంస్మరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కాకినాడకు చెందిన అసోసియేట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కొయ్యలగూడెం వాసి కొల్లూరి కిషోర్ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలోని ఎంపీపీ స్కూల్ (మెయిన్) ఆవరణలో వందమందికి పైగా యాచకులకు, వృద్ధులకు అన్న సమారాధన చేశారు. అదేవిధంగా దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని వృద్ధాశ్రమం, దివ్యాంగుల శిబిరంలోని అరవై మందికి అన్నదాన, పౌష్టికాహారాన్ని అందజేశారు. తలశిల రఘురాం ధర్మపత్నిగా స్వర్ణకుమారి ఆయన రాజకీయ ఎదుగుదలలో వెన్నంటి నిలిచారని ఆశ్రమ నిర్వాహకులు కాగితాల భాస్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఖండేల్లి శివ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు మాడుతూరి శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకును పండించాలి



మార్కండేయపురంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పురుగుమందు అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పండించేలా రైతులు కృషి చేయాలని, తద్వారా మెరుగైన ఆదాయం సంపాదించేందుకు అవకాశం ఉంటుందని ఎస్ఎల్ఎస్ రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని మార్కండేయపురంలోని రైతు కూచిపూడి రమేష్ చౌదరి వ్యవసాయ క్షేత్రంలో క్షేత్ర దినోత్సవ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్జీనియాలో సైతం ప్రకృతి వ్యవసాయం అవలంభించాలన్నారు. అలాగే కేఆర్‌బీ (పొటాసియం రిలీజింగ్ బ్యాక్టీరియా) వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసేందుకు బోర్డు సూచించిన మేరయాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంతో పాటు కేఆర్‌బీ వాడిన రైతు కూడిపూడి రమేష్‌ను, జెడ్పీఎన్ఎఫ్ వాడి ప్రకృతి వ్యవసాయం చేసిన తస్నీరు రామకృష్ణలను అభినందించి, వారికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం–1 వేలం నిర్వహణాధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో సుధీర్, ఐటీసీ కంపెనీ మేనేజర్ వెంకటేష్, జీపీఐ కంపెనీ రవి, పీఎస్ఎస్ కంపెనీ నాగేంద్ర, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ ఆధునికీకరణ పనులు

భీమడోలు: భీమడోలు నుంచి కామవరపుకోటకు వెళ్లే విద్యుత్ లైన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా బుధవారం జాతీయ రహదారిపై భీమడోలు మండలం పోలసానిపల్లి హైవే క్రాసింగ్ వద్ద విద్యుత్ లైన్ ఆధునీకరణ పనులను బుధవారం ఉదయం యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సాయంత్రానికి పూర్తి చేశారు. దీనితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే భారీ వాహనాలను సంబంధిత అధికారులు భీమడోలు జంక్షన్ మీదుగా మళ్లించారు. సాయంత్రానికి పనులు పూర్తి కావడంతో రహదారిపై యథావిధిగా వాహనాలు రాకపోకలు ప్రారంభమయ్యాయ. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు. భీమడోలు 220 సబ్ స్టేషన్ నుంచి కామవరపుకోటకు 18 కిలోమీటర్ల దూరం విద్యుత్ ఆధునీకరణ పనులను విద్యుత్ ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో ఈ విద్యుత్ లైన్ అధునీకరణ పనులను చేపట్టేందుకు జాతీయ రహదారి పోలసానిపల్లి వద్ద గల ఆరు వరసల రోడ్డు మీదుగా విద్యుత్ లైన్ వెళ్తుంది. ఈ క్రమంలో రోడ్డు క్రాసింగ్ పనులు చేసేందుకు సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు నేషనల్ హైవే అథారిటీ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. విద్యుత్ అధునీకరణ పనులను ఏలూరు డీఈఈ బి.రామకృష్ణ పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. క్రేన్ల సాయంతో విద్యుత్ లైన్ ఆధునీకరణ చేపట్టి పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయితే నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులు పంపిణీ చేయవచ్చని డీఈఈ బి.రామకృష్ణ తెలిపారు. పోలసానిపల్లి హైవేపై ఇరువైపులా ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగించకుండా పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీనితో ఏలూరు నుంచి రాజమండ్రి, రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్లే వాహనాలు భీమడోలు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించాయి. దీనితో వాహనాలన్నీ కిలోమీటర్ల మేర క్యూ కట్టాయి. భీమడోలు జంక్షన్ వద్ద వాహనాల రద్దీ ఏర్పడింది. విద్యుత్ అధునీకరణ పనులు సాయంత్రానికి పూర్తి కావడంతో హైవే రాకపోకలను యథావిధిగా పునఃప్రారంభమయ్యాయి.

ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభల బహిష్కరణ

వేలేరుపాడు :పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ఇంటి విలువలు (స్ట్రక్చర్ వాల్యూస్) చాలా తక్కువగా వచ్చాయంటూ గ్రామసభలను బుధవారం నిర్వాసితులు బహిష్కరించారు. తాట్కూరుగొమ్ము గ్రామ పంచాయతీ పరిధిలోని జగన్నాధపురం, రేపాకగొమ్ము గ్రామాల్లో గ్రామసభలను బహిష్కరించారు. గతంలో అనేకసార్లు ఇంటి విలువలు ప్రకటించారని, 2019 డిసెంబర్ 26న గ్రామ సభలు నిర్వహించి అధికారికంగా ప్రకటించి, నిర్వాసితుల సంతకాలు తీసుకున్నారని, మరలా ఇప్పుడు గ్రాసభలేంటని ప్రశ్నించారు. ఇంటి విలువలు రూ.4 వేలు, రూ.5 వేలు ఎలా వచ్చాయంటూ నిలదీశారు. గతంలో ఒక్క జగన్నాధపురంలో రూ.20 కోట్ల 70 లక్షల 73 వేల 307 ఉన్న ఇంటి విలువల పరిహారం ప్రస్తుతం రూ.8.50 కోట్లకు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో గ్రామ సభల్లో ప్రకటించిన ఇంటి విలువలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, సోయం వెంకమ్మ , గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్తెన్నగూడెంలో జీడిమామిడి తోట దగ్ధం



సత్తెన్నగూడెంలోని జీడిమామిడి తోటలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ద్వారకాతిరుమల : విద్యుత్ వైరు తెగిపడి నిప్పంటుకోవడంతో ఒక జీడిమామిడి తోట దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని సత్తెన్నగూడెంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన కౌలురైతు పెండెం ఆంజనేయులు జీడిమామిడి తోటపై విద్యుత్‌లైను ఉంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక వైరు తెగి, జీడిమామిడి తోటలో పడింది. దాంతో తోటకు నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. ఎండ తీవ్రత కూడా అధికంగా ఉండటంతో క్షణాల వ్యవధిలో తోట మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానిక రైతుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు 5 ఎకరాల జీడిమామిడితోట దగ్ధమైనట్టు బాధిత రైతు ఆంజనేయులు తెలిపాడు.

ఆశ వర్కర్‌ను వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు

ద్వారకాతిరుమల : తన భర్త, అత్తమామలపై ఒక ఆశ వర్కర్ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. గుండుగొలను కుంటకు చెందిన ఆశ వర్కర్ ఓగిరాల రాజేశ్వరిని ఆమె భర్త ఓగిరాల బాపిరాజు రోజూ మద్యం సేవించి వచ్చి, అనుమానిస్తూ హింసిస్తున్నాడు. బాపిరాజు తల్లిదండ్రులు అతడిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో గత నాలుగేళ్లుగా ఒకే ఇంట్లో విడివిడిగా ఉంటున్నారు. ఈనెల 12న రాజేశ్వరి నీళ్ల పంపు వద్ద బట్టలు ఉతుకుతుండగా ఆమె భర్త ఇష్టానుసారం తిట్టి కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి, చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

గ్రామాల్లో ఆక్వా జోన్ పరిధిపై సర్వే

దెందులూరు: చేపల చెరువుల రైతులకు విద్యుత్ బిల్లు రాయితీ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా జోన్ పరిధిపై సర్వేకు ఆదేశాలు జారీ చేసిందని మత్స్యశాఖ సహాయకురాలు ఎస్.ప్రవల్లిక అన్నారు. బుధవారం పోతునూరులో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపల చెరువులు 10 ఎకరాల్లోపు ఆక్వా జోన్‌లో ఉంటే యూనిట్‌కు 1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తిస్తుందని లేకుంటే రూ.3.80 పైసలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తించేలా ఆక్వా జోన్ పరిధిపై సర్వే చేయాలని మత్స్యశాఖ సహయకులందరికీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 2018లో ఆక్వాజోన్‌పై సర్వే చేసి పాత చేపల చెరువులను జోన్‌లో పెట్టారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి గెజిట్ సైతం విడుదలైందన్నారు. ప్రభుత్వపరంగా నిబంధనలకు లోబడి వృత్తిపరంగా ఆక్వా రైతులను ప్రోత్సహించడం, రాయితీలు సకాలంలో అమలు, అనుమతులు వేగంగా మంజూరు చేయడం కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. మత్స్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తోందన్నారు. దెందులూరు మండలంలో 2018లో 2,237 ఎకరాల చేపల చెరువులు జోన్ పరిధిలో ఉన్నాయని సర్వేద్వారా ప్రస్తుతం విస్తృతి పెరిగే అవకాశం ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన ఆక్వా చెరువులను సర్వే పూర్తి చేసి జోన్ పరిధి పెంచేందుకు అనుమతుల కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. త్వరలో చేపల చెరువుల రైతులు రాయితీ పొందేందుకు ఆదేశాలు వెలువడనున్నాయన్నారు. గ్రామాల్లో మత్స్యశాఖ సహాయకులు చేస్తున్న సర్వేను దెందులూరు మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి ఈశ్వర్ పర్యవేక్షిస్తున్నారు.